www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు



వైభవంగా బొజ్జ గణపయ్య రథోత్సవం

- రథాన్ని లాగేందుకు పోటీపడిన భక్తులు
- ప్రత్యేకపూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి- ఐరాల : కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 8వ రోజు మధ్యాహ్నం సిద్ధి, బుద్ధి సమేత శ్రీవిఘ్నేశ్వరుడు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ముందుగా కాకర్లవారిపల్లె గ్రామానికి చెందిన ఉభయదారులు మీనా కుమారి, పూర్ణచంద్రరెడ్డిలు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కి సారెను అందజేశారు. స్వామి, అమ్మవార్లకు అందజేసే సారెతో ఊరేగింపుగా రథం వద్దకు ఎమ్మెల్యే చేరుకున్నారు. శోభాయమానంగా అలంకరించిన రథాన్ని అధిరోహించిన సిద్ధి, బుద్ధి సమేతుడైన విఘ్నేశ్వరుడి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని భక్తులతో కలిసి గణపయ్య నామస్మరణ చేస్తూ ముందుకు లాగారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనల నడుమ కాణిపాకం పురవీధుల్లో రథంపై స్వామి, అమ్మవార్లు ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్లు విహరిస్తున్న రథాన్ని స్వయంగా లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవం సందర్భంగా కాణిపాకం పూర్తిగా భక్తులతో కిక్కిరిసింది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు కాణిపాకం చేరుకోవడంతో కాణిపాకం భక్త జనసంద్రంగా మారింది. అధిక సంఖ్యలో భక్తులు కాణిపాకం విచ్చేసే అవకాశం ఉండడంతో ఉదయం నుండి ఎమ్మెల్యే భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యావేక్షిస్తూ త్వరితగతిన స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో భారీగా పోలీసు బందోబస్తు నడుమ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించారు.

సేద్యం.. సాధ్యమేనా..

- కరుణించని వరుణుడు
- కళ్ళముందే ఎండుతున్న పంట
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం

ప్రకృతినే నమ్ముకుని అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసే రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎస్ఆర్‌పురం మండలం పరిధితో సకాలంలో వర్షాలు పడక వేసిన పంటలు కళ్ళముందే ఎండిపోతుంటే నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులు పంట కోసం తెచ్చిన అప్పును ఎలా తీర్చాలో తెలియక సతమతమవుతున్నారు. జూన్, జులై నెలల్లో పడిన తొలకరి జల్లుతో రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యారు. దుక్కులు దున్ని వేరుశనగ విత్తనాలు చల్లారు. అయితే సకాలంలో వరుణుడు కరుణించకపోవడంతో రైతల ఆశలు అడిఆశలుగా మిగిలాయి. రాయితీ ప్రభుత్వం వేరుశనగ విత్తనాలు, అంతర్‌పంటల విత్తనాలను పంపిణీ చేసినప్పటికీ సాగుకు నీరు చాలక రైతులు అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడు పడిన కాస్తోకూస్తో వానలకు పంటపొలాల్లో చిగురు చూసి రైతన్నలు ఆశలు చిగురించాయి.. కానీ అంతలోనే నీరు చాలక వేరుశనగ కాయలు ఆశించిన మేర సాగు కాలేదు.. మధ్య దశలో పంటలకు నీరు చాలకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు.. అప్పులు చేసి మరీ ఎన్నో ఆశలతో వేసిన పంట కళ్ల ముందే నీరులేక ఎండుతుంటే రైతు కంట కన్నీరు ఆగడం లేదు.. ఆగస్టులో అయినా వర్షాలు పడతాయని ఆకాశం వైపు ఆశగా రైతు చూసినా వర్షం లేని దుస్థితి.. పూర్తిగా వర్షాధార పంట అయిన వేరుశనగకు వానలు లేక తీవ్ర నష్టం తప్పలేదు.. ఇక బోర్లు ఉన్నా.. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వారి పరిస్థితి అయోమయంగానే ఉంది..




2023- 24 సంవత్సరంలో మండలంలో సుమారు 346 హెక్టార్ల విస్తీర్ణంలో రైతు వేరుశనగ పంటను వేశారు. గత సంవత్సరంలో అంతోఇంతో వర్షాలు పడటంతో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా దక్కింది.. అయితే 2024-25 ఖరీఫ్ సీజన్‌లో మండలలోని రైతులు 320 హెక్టార్లలో వేరుశనగ పంట సాగుకు సిద్ధమయ్యారు.. గతంతో పోలిస్తే 26 హెక్టార్లు విస్తీర్ణం పంట తగ్గింది. వర్షాలు లేకపోవడంతో పంట సాగు చేసే విస్తీర్ణం కూడా తగ్గిపోయింది.

పెనుభారంగా మారిన కూలీ రేట్లు..

పంట సాగుకు ఏ పనిచేయాలన్నా ప్రస్తుతం వ్యవసాయ కూలీలు అవసరం. ఐదు సంవత్సరాల క్రితం పల్లెలో వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉండే వారు. కూలీ గిట్టుబాటు అయ్యేది.. దీంతో జీవనం సాఫీగా సాగేది. అయితే క్రమంగా వ్యవసాయ సాగు తగ్గడంతో పనులు లేక వారు పట్టణాలకు వలసలు మొదలుపెట్టారు. క్రమంగా వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గి కూలి రేట్లు పెరిగాయి. దీంతో రైతులకు కూలీల భారం తప్పడం లేదు.. మండలంలో ఉన్న వ్యవసాయ కూలీలకు మగవారికి రూ.500లు, మహిళలకు రూ.350లు కూలి చెల్లించాలి. దీంతోపాటు పంటసాగుకు ఎరువులు, మందులు అదనపు ఖర్చులు పోను రైతులకు రాబడి లేకుండా పోతోంది. దీంతో చాలా వరకు సాగు భూము బీడు భూములుగానే మిగిలిపోతున్నాయి..

ప్రభుత్వం ఆదుకోవాలి..

- బోడిపాటి బాలాజీ నాయుడు, రైతు, చేకూరివారిండ్లు, ఎస్ఆర్‌పురం



నాకు రెండు ఎకరాల సాగు భూమి ఉంది. జూన్ నెల చివరి వారంలో వానలు పడటంతో రాయితీ వేరుశనగను దుక్కులుదున్ని విత్తనాలు వేశాను. ఒక ఎకరానికి రూ.10వేలకు పైనే ఖర్చు అయ్యింది. రెండు ఎకరాలకు రూ.20వేలు కూలీలు, ఇతర ఖర్చులు అయ్యాయి. ఎంతో ఆశతో వేసిన పంట వర్షాలు లేకపోవడంతో కళ్ళముందే ఎండిపోతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి..

సూచనలు పాటించండి..

- నర్మద, వ్యవసాయాధికారి, ఎస్ఆర్‌పురం



వేరుశనగ పంట వేసిన రైతులు బోరు బావులు ఉండి నీళ్ల అందుబాటులో ఉంటే ఒక తడి నీరు కట్టుకోవాలి. మిట్ట ప్రాంతంలో వర్షాధార పంటగా వేరుశనగ వేసిన రైతులు నీళ్ల అందుబాటులో లేకపోతే 20 గ్రాముల యూరియాని 200 లీటర్ల నీటితో కలిపి ఒక ఎకరా పంట పై పిచికారి చేస్తే పంటకు పది రోజులు ఉపశమనం కలుగుతుందన్నారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి 138 క్వింటాలు వచ్చాయి. సబ్సిడీ క్రింద రైతులకు ఇప్పటికే 70 కింటాలు ఉలవలను పంపిణీ చేసింది. వీటిని కూడా మిగిలిన రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

నూతన కమిషనర్‌గా నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమితులైన పి.నరసింహ ప్రసాద్ శనివారం నగరపాలక కార్యాలయానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పుంగనూరు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహ ప్రసాద్‌ను చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 4వ తేదీన చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన నేరుగా విజయవాడ వరదల సహాయ చర్యల విధుల్లో చేరారు. అక్కడ విధులు ముగియడంతో శనివారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని చేరుకున్నారు. నూతన కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌కు నగరపాలక అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర రెడ్డి, ఆర్ఐలు అదామ్, గోవర్ధన్, యుడీఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, ఇతర ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

విజయవంతంగా ముగిసిన లోక్ అదాలత్

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాజీ చేసుకోదగిన క్రిమినల్, సివిల్ కేసులన్ని కూడా జాతీయ లోక్ అదాలత్‌లో సామరస్యంగా పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అధ్యక్షులు ఇ. భీమారావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వెన్నిల, 1వ అదనపు జిల్లా జడ్జి రమేష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ యాదవ్‌లతో కలసి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమారావు మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్, భూ తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9259 కేసులను గుర్తించడం జరిగిందని తెలిపారు.

కుప్పం టౌన్ : పట్టణంలోని న్యాయస్థానంలో న్యాయమూర్తి ఆరిఫా షైక్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 136 కేసులు రాజీ కుదిరినట్టు తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 19, క్రిమినల్ కేసులు 105, బ్యాంకులకు సంబంధించిన కేసులు 12 ఉన్నట్టు తెలిపారు.

ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: చౌడేపల్లి సిపిఎం శాఖా మహాసభ శనివారం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. మహాసభలో అమరవీరులకు నివాళులర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయిన సిపిఎం ఆల్ ఇండియా కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిశీలకులగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ సిపిఎం నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తూ ప్రజాగొంతుకగా ఉన్న పార్టీ అని తెలిపారు. నేడు దేశవ్యాప్తంగా ఏచూరి గురించి ఎంతగొప్పగా చెబుతున్నారంటే ఆయన ప్రజల కోసం చేసిన పోరాటాలు ఆయనను ఈ స్థాయిక తెచ్చాయన్నారు. విద్యార్థి దశమించే దైర్యశాలిగా పోరాడుతున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. సిపిఎం విస్తరణకు ప్రతి శాఖా అంకనబద్ధులై కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ చంద్ర, రామకృష్ణ, వాసు పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా డాక్టర్ చంద్రన్న ఎన్నుకోవడం జరిగింది.



ఈ 'లీల'కు 'మూలం' ఏది..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఎంఎల్‌ఏ స్థాయి వ్యక్తి ఓ మహిళతో సాగించిన రాసలీలలు ఇటీవల రాష్ట్రంలో దూమరాన్ని రేపాయి. జిల్లాకు చెందిన శాసనసభ్యుడు తన కోర్కె తీర్చాలంటూ బలవంతంగా లైంగిక దాడికి దిగిన వీడియో క్లిప్పింగ్‌లతో సహా నెట్టింట్‌లో హల్‌చల్ చేశాయి. ఆఖరికి ఆయన్ను పార్టీ సస్పెండ్ చేసింది. ప్రత్యర్థులు ఉద్దేశపూర్వకంగానే తనను ఇరికించారని బాధితుడు ఆక్షేపిస్తున్నా ఈ రాసలీల వెనుక దాగి ఉన్న మూలాలు ఇప్పటికి జిల్లాలో రహస్యంగానే ఉండటం గమనార్హం.

గౌరవప్రదమైన పదవిలో ఉన్న శాసనసభ్యులు ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక దాడికి పాల్పడి పార్టీ నుంచి సస్పెండైన ఘటన జిల్లా చరిత్రలో ఇటీవల చోటు చేసుకుంది. తిరుపతి జిల్లాలోని ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడు నుంచి 2024 ఎన్నికల్లో ఎంఎల్‌ఏగా గెలుపొందిన ఆదిమూలం, గతంలో 2019లో వైసిపి తరుపున ఎంఎల్‌ఏగా గెలిచారు. ఓ దశలో మంత్రి పదవికి సైతం పోటీలో నిలిచారు. కానీ ఇటీవల కాలంలో ఈ నెల 5వ తేదీన నియోజకవర్గంలో టిడిపికి చెందిన వరలక్ష్మి అనే ఓ మహిళ హైదరాబాదు వేదికగా ఎంఎల్‌ఏ ఆదిమూలం తనను లైంగికంగా హింసించాడని, తన కోర్కె తీర్చకపోతే, భర్త, పిల్లల్ని చంపేస్తాడని బెదిరించారని, తిరుపతిలోని ఓ హోటల్‌లో ఆయన తనను బెదిరించి లైంగికంగా దాడి చేశాడని ఆరోపించింది. ఇది ఒక్కసారిగా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. టిడిపికి అనుకూలమైన ఓ ఛానల్‌లో సైతం వైరల్ కావడంతో తెలుగుదేశం పార్టీ స్పందించి వెనువెంటనే ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అదే రోజు ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు సైతం కేసు నమోదు చేసి ముందుకెళ్లారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం తిరుపతి ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో సైతం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసు ప్రస్తుతం విచారణ జరుగుతోంది. మరో పక్క తనంటే గిట్టని వారు, ప్రత్యర్థులు ఆమెకు డబ్బు ఆశ చూపి, తనపై లేనిపోని అభూతకల్పనలు సృష్టిస్తున్నారని, తను ఎవ్వరికి ఎలాంటి హానీ చేయలేదని ఎంఎల్‌ఏ వెల్లడిస్తున్నారు. వాస్తవానికి నియోజకవర్గంలో వైసిపి ఎంఎల్‌ఏగా ఉంటూ ఎన్నికల ముందు టిడిపి తీర్థం తీసుకుని, బరిలో నిలిచిన ఆదిమూలానికి నియోజకవర్గ టిడిపి నాయకత్వం మద్దతు నిరాకరించింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు కూడా ఆయన వద్దని అధినేతకు సూచించారు. ఎట్టికేలకు ఎనిక్రల్లో ఆయన గెలుపొందారు. వైసిపి నాయకులే తనపై కక్షకట్టి ఇలా చేశారన్నది ఆ ఎంఎల్‌ఏ వాదన. వారికి టిడిపిలోని ప్రత్యర్థి వర్గం సహకరించిందని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. దీంతో దళిత సంఘాలు ఎంఎల్‌ఏకి మద్దతుగా నియోజకవర్గంలో నిరసనలు చేపట్టింది. ఎంఎల్‌ఏ దళితుడు కావడంతోనే ఇలా పెత్తందారులు ఆయన్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. అయితే ఓ మహిళ తానే ప్రాణానికంటే మిన్నగా చూసుకునే శీలంపై స్వయంగా అభాండాలు వేసుకునే ఛాన్స్ లేదని, ఇందులో కొంతైనా వాస్తవం ఉంటుందని జిల్లా వాసుల మనోగతం. ఏది ఏమైనా మహిళల పట్ల నీచంగా వ్యవహరించే వారికి కఠిన శిక్షలు తప్పనిసరి. ఆదిమూలం రాసలీలల వెనుక ఏ మూలం దాగి ఉందో విచారణలో వెల్లడి కానుంది.

జీవో నెంబర్ 188 రద్దుపై హర్షం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జీవో నెంబర్ 188 రద్దుచేసి పాత ఎక్సైజ్ పాలసీ విధానాన్ని తీసుకురావడం పట్ల ఎక్సైజ్ సిబ్బంది హర్షం ప్రకటించారు. ఈమేరకు శనివారం మిట్టూరులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోనో రద్దుచేసి ఎక్సైజ్ ఎస్ఇలిలను ఏకీకృతం చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఉద్యోగులు సిబ్బంది ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, కొల్లు రవీంద్రకు ఎక్సైజ్ శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కుప్పం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సృజన్ బాబు, ఎస్సై అన్వేష్‌ల ఆధ్వర్యంలో సిఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

వరద బాధితులకు విరాళం



వరద బాధితులకు ఆర్థిక సాయాన్ని బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రూ.32,49,653.14లు వరద బాధితుల కోసం భారీ ఆర్థిక సాయాన్ని అందించింది. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ వరద బాధితుల సహాయార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకు నుండి చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలసి అందించారు. వరద బాధితుల కోసం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ విరాళం అందించడాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.

రూ.లక్ష విరాళం అందించిన టిఎం.బాబు



గుడిపల్లి: విజయవాడ వరద బాధితులకు మండలంలోని టిడిపి మండల అధ్యక్షులు టిఎం.బాబు లక్ష రూపాయలను విరాళం సిఎం సహనిధికి పంపినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు విజయవాడ వరద బాధితులకు తోచిన సాయం అందించి చేదోడువాడోడుగా నిలవాలని పిలుపునిచ్చారు.

వరద బాధితులకు అండగా వైద్యులు



కుప్పం టౌన్ : వరద బాధితులకు అండగా కుప్పం వైద్యులు తమ వంతు సాయంగా రూ.7,64,000లను విరాళంగా అందజేశారు. ప్రముఖ వైద్యులు, టిడిపి కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ వరదల వల్ల విజయవాడ ప్రజలు తీవ్రఇబ్బందులు ఎందుకున్నారని, వారికి అండగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కుప్పం శాఖ సభ్యులు డాక్టర్లు ప్రశాంత్, మంజునాథ్, సుధీర్, శివప్రకాష్ సహా ఇతర వైద్యులు కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని సిఎం వ్యక్తిగత సహాయకులు మనోహర్, టిడిపి అడ్వైజర్ నరేష్ చారి, మున్సిపల్ కౌన్సిలర్ దాము, నియోజకవర్గ మైనారిటి అధ్యక్షులు జాకీర్‌లకు అందజేశారు.

రోడ్డును తవ్వేస్తుంటే పట్టించుకోరా..

- మమ్మల్ని ఎవరు ఆపేదంటున్న కాంట్రాక్టర్
- ఇష్టానుసారంగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న ఆర్అండ్ బి అధికారులు

ప్రజాశక్తి- విజయపురం:

బుగ్గఅగ్రహారం మీదుగా విజయపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును ఓ ప్రైవేట్ సంస్థ ఇష్టారాజ్యంగా తవ్వేస్తుంటే ఎవ్వరు పట్టించుకోలేదు. అసలే విజయపురం మండలం మారుమూల ప్రాంతం.. రోడ్డు సౌకర్యం అంతంత మాత్రం.. ఆ రోడ్డును కూడా ఓ ప్రైవేట్ సంస్థ ఓఎఫ్‌సీ పైపు లైన్ కోసం ఇష్టారాజ్యంగా తవేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఇటీవల రోడ్డుకు మూడు అడుగు దూరంలో రూ.2కోట్ల వ్యయంతో బుగ్గకాలువ నిర్మాణ పనులు జరిగాయి. అలాగే ఉపాధి హామీ ద్వారా రోడ్డుకు ఇరు పక్కల మొక్కలు నాటారు. వీటన్నిటినీ ఏ మాత్రం పట్టించుకోకుండా ఆర్అండ్‌బీ రోడ్డును అడ్డగోలుగా తవ్వేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



జెసిబితో రోడ్డును తవ్వేస్తున్న ప్రైవేట్ సంస్థ సిబ్బంది

నిబంధనలు పాటించరా...

ఆర్అండ్‌డి రోడ్డు పక్కన ఏ ప్రైవేట్ సంస్థ అయిన ఓఎఫ్‌సీ పైపులైన్ వేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అలాగే రోడ్డుకు సుమారు 5 అడుగుల దూరంలో పైపులైన్ వేయాలని నిబంధన కూడా ఉంది. అలాంటి నిబంధనలు ఏమి పట్టించుకోకుండా రోడ్డును తవ్వేస్తున్నారు. విషయం తెలుసుకొన్న ఇరుగేషన్ ఏఈ సంఘటన స్థలానికి వచ్చి కాలువ పక్కన మట్టిని తీయడం ద్వారా కాలువ దెబ్బతింటుందని చెప్పినా ఆసంస్థ సిబ్బంది పట్టుంచుకోకపోవడం గమనార్హం.

అధికారులు పట్టించుకోరా...

విజయపురం మండలానికి వెళ్లాలంటే రోడ్డు మార్గం అంతంత మాత్రంగానే ఉంది. ఉన్న రోడ్డు కూడా అక్కడక్కడ గుంత ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఉన్న ఆ కూసింత రోడ్డును కూడా తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు దీనిపై దృష్టి పెట్టి రోడ్డును బాగు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

150 గుంతలు పూడ్చేశారు..

- బబిత, ఏపీవో, విజయపురం


ఇటీవల బుగ్గకాలువ పక్కన ఉపాధి హామీ కింద సుమారు 150 గుంతలు తీశాం. వాటికి ఇంత వరకు బిల్లు కూడా రాలేదు. ఇంతలో ఓ ప్రైవేట్ సంస్థ సిబ్బంది జెసిబిలతో వాటిని పూడ్చేశారు. చేసిన పనులకు బిల్లుకు కూడా రాలేదు.. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఎవరు చెప్పినా వారు వినిలేదు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తాం.

బ్రహ్మోత్సవాల తరువాతేనా 'బోర్డు'

టిటిడి ఛైర్మన్ పదవికి 12 మంది పోటీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి లేనిదే బ్రహ్మోత్సవాలు జరగవు. ఒకవేళ జరపాలంటే రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐఎఎస్‌లతో స్పెసిఫైడ్ అథారిటీని నియమించి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తుంది. అలాంటిది ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలైనా కీలకమైన టిటిడి బోర్డును ఏర్పాటు చేయకపోవడం చూస్తుంటే ఛైర్మన్ పదవికి టిడిపి, జనసేన నుంచి డజన్ మందిపైగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి తయారయ్యింది. అక్టోబర్ 3 నుంచి సాలికట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే టిటిడి పూర్తిస్థాయి బోర్డును ప్రకటించి, భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. విజయవాడ వరదల పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తున్నారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నా, వాస్తవానికి ఎక్కువమంది పోటీ పడటం వల్లనే తేల్చలేకపోయారన్న చర్చ నడుస్తోంది. కేంద్ర మాజీ మంత్రి




అశోక్‌గజపతి రాజు, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సినీ నిర్మాత అశ్వనీదత్, సినీ నటుడు మురళీమోహన్, జనసేన నుంచి కొణిదెల నాగబాబు, టివి 5 ఎమ్‌డి బిఆర్ నాయుడు, తిరుపతి వాస్తవ్యుడు జనసేన జిల్లా ఇన్‌ఛార్జి పసుపులేటి హరిప్రసాద్ సైతం ఛైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్నారు. అయితే బిజెపి, టిడిపి, జనసేన కూటమిలో అధికారం చేపట్టిన తరువాత నామినేటెడ్ పదవుల విషయంలో ఒప్పందం కుదిరింది. ఆగస్టులో నామినేటెడ్ పదవుల పందేరం ఉందని చర్చ నడిచినా, వరదల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే అక్టోబర్‌లో జరగనున్న బ్రహ్మోత్సవాలు బోర్డు లేకుండానే, అధికారులతోనే జరిగే అవకాశం ఉంది.

'పెద్దిరెడ్డి'కి ప్రాధాన్యత ఏది..?

జగన్‌పై వైసిపి శ్రేణుల గుర్రు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



పార్టీ అధికారంలో ఉన్నపుడు, లేనపుడు ఏ ఉప ఎన్నిక జరిగినా 'పెద్దిరెడ్డి' ఆర్థికంగానూ, రాజకీయ బలంతోనూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. జిల్లాలో 'పెద్దాయన'గా గుర్తింపు పొందిన పెద్దిరెడ్డికి రాష్ట్రస్థాయిలో కీలక పదవి ఇవ్వకుండా కేవలం చిత్తూరు జిల్లాకే పరిమితం చేయడంపై ఆ పార్టీ శ్రేణులు అధినేత జగన్‌పై గుర్రు మంటున్నారు. మాజీ మంత్రి ఆర్‌కె రోజాకు రాష్ట్రస్థాయి కీలక పదవి ఇచ్చి, పెద్దిరెడ్డిని జిల్లాకే పరిమితం చేయడంపై చర్చ నడుస్తోంది.

ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో చెవిరెడ్డి భాస్కరరెడ్డికి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టడం.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్థాయి తగ్గించడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. అంటే ఇంతకాలం రాయలసీమ సీఎంలా వ్యవహరించిన పెద్దిరెడ్డిని జగన్ కావాలనే పక్కన పెడుతున్నారా? అన్న చర్చ మొదలైంది. రాయలసీమలో వైసిపికి అంతో ఇంతో మర్యాద నిలిపిన జిల్లా అంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా అని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు రెండు ఎంపీ స్థానాలు గెలిచిన జిల్లా చిత్తూరు ఒక్కటే.. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నుంచి నలుగురు ఎంపీలు గెలిస్తే అందులో ఇద్దరు ఈ జిల్లా నుంచే గెలిచారు. ఇక జిల్లా నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఒక ఫ్యామిలీ వారే.. పుంగనూరు నుంచి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె నుంచి ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిలు మెజార్టీలు గణనీయంగా తగ్గినా గట్టెక్క గలిగారు. రాజంపేట ఎంపీగా గెలిచిన మిథున్‌రెడ్డి కూడా పెద్దిరెడ్డి వారసుడే.

జగన్ అధికారంలో ఉన్న అయిదేళ్లు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఒక రేంజ్లో నడిచింది. నగరిలో రోజా, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి, శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఓడిపోవడానికి ప్రధాన కారణం 'పెద్దిరెడ్డి' రాజకీయ డ్రామా అని జగన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలోనే పెద్దిరెడ్డికి ప్రాధాన్యత తగ్గించినట్లు చర్చ నడుస్తోంది. రోజాకు వ్యతిరేకరంగా పనిచేసిన నగరి మున్సిపల్ ఛైర్మన్ శాంతికుమార్ దంపతులను పార్టీనుంచి సస్పెండ్ చేయించడం చూస్తుంటే రోజాకు ఇచ్చిన ప్రాధాన్యత పెద్దిరెడ్డికి ఇవ్వలేదని ప్రస్ఫుటంగా అర్థమవుతుంది. అలాగే చిత్తూరులో విజయానందరెడ్డికి వ్యతిరేకంగా పనిచేసిన పెద్దిరెడ్డి అనుచరులు బుల్లెట్ సురేష్ అనుచరులను పార్టీనుంచి సస్పెండ్ చేయాలని అధినేతను కోరినట్లు సమాచారం. మరో వైపు పలమనేరు మాజీ ఎమెల్యే వెంకటేగౌడ తనకు కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ రెడ్డెమ్మ తో పాటు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఎన్నికలలో సహకరించలేదని జగన్‌కు ఫిర్యాదు చేశారంట. అయితే వీరిలో రెడ్డెమ్మది పెద్దిరెడ్డి వర్గం కాగా శ్రీనివాసులు మాత్రం భారతి సిఫార్సుతో పదవి తెచ్చుకున్న వ్యక్తి. కుప్పంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబుకు సింపతీ ఇమేజ్ పెరగడానికి సెంథిల్ లాంటి వ్యక్తులు వ్యవహరించిన తీరు కారణమని చర్చించుకున్నారంట. మొత్తం మీదా ఓటమి పాలైనా పార్టీలో తమదే పైచేయి అని రోజా, చెవిరెడ్డిలు నిరూపించుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

'బాబు' వ్యూహానికి చెక్ పెట్టేందుకే..!

వైసిపి రాష్ట్ర కార్యవర్గంలోకి రోజా, భూమన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అనూహ్యంగా విజయభేరి మోగించింది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓటమిని చవిచూసింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వైసిపి కంచుకోట. కాంగ్రెస్, వైసిపి హయాంలోనూ కొన్ని నియోజకవర్గాల్లో మూడు దశాబ్దాలుగా గెలుస్తూ వచ్చిన నియోజకవర్గాలు ఉన్నాయి. భారీ ఓటమి పాలు కావడంతో జగన్‌కు దిమ్మ తిరిగింది. తాజాగా ఉండవల్లి ప్యాలెస్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పూర్వ వైభవం తెచ్చేందుకు వ్యూహం రచించారు. ఈ జిల్లాల్లో బాబు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ఫైర్‌బ్రాండ్ రోజాకు, మాటల చతురత చాటే భూమన కరుణాకర్‌రెడ్డికి రాష్ట్ర అధికార ప్రతినిధులుగా చోటు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురికి అవకాశం ఇస్తే, అందులో ఇద్దరు చిత్తూరు నుంచి ఆర్‌కె రోజా, తిరుపతి జిల్లా నుంచి భూమన కరుణాకర్‌రెడ్డిలను ఈ పదవులు వరించాయి. అటు రోజా, ఇటు భూమన కరుణాకర్‌రెడ్డిలు ఈ పదవులు ఇవ్వడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికార ప్రభుత్వ పథకాలపైన, అవినీతి అక్రమాలపైన నిరంతరం అధ్యయనం చేస్తూ ఎప్పటికప్పుడు ప్రతిపక్షంలో మాటల బాణాలు విసరడమే వీరి పని. రాష్ట్రవ్యాప్తంగానూ రోజా, కరుణాకర్‌రెడ్డిలకు ప్రత్యేక స్థానం ఇచ్చేలా క్యాడర్‌కు హితోపదేశం చేసినట్లు తెలుస్తోంది. టిడిపి కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి, ప్రభుత్వం ఏర్పడిన తరువాత విస్మరించడంపైనా వివరాలను సేకరించి ప్రతిపక్ష హోదాలో వీరిద్దరూ ప్రచారం చేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాష్ట్ర కేంద్రంలో ఇద్దరికి చోటు కల్పించడం వైసిపి శ్రేణుల్లో ఆనందం నెలకొంది.

మొగిలి ఘాట్ ప్రమాదం మానవ తప్పిదం

డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి- వెదురుకుప్పం

చిత్తూరు జిల్లా నిత్యం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొగిలి ఘాట్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మొగిలి ఘాట్ రోడ్డు నిర్మాణంలో లోపాలున్నాయని, వెంటనే రోడ్డు భద్రత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఘాట్ రోడ్డులో మలుపుల వద్ద కనీసం నాలుగు అడుగుల ఎత్తు డివైడర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఘాట్ రోడ్లలో వేగనిరోధక సూచిక బోర్డులను మరింత ఎక్కువగా ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ప్రమాద నిరోధక చర్యలు వేగంగా చేపట్టి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలం పుల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో జనసేనపార్టీ ఎస్ఆర్ పురం మండలాధ్యక్షుడు చిరంజీవి, పుల్లూరు సర్పంచ్ గంగినేని భవ్య, పవన్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని వైదేహి హాస్పిటల్ మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ నానబాల లోకేష్ రాయల్ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, కిడ్నీ, షుగర్, గ్యాస్టిక్ ఎంట్రాలజీ, న్యూరాలజీ వ్యాధులతో బాధపడుతున్న వారికి, అలాగే ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉన్నవారికి వైద్య నిపుణులతో చికిత్స నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారికి బెంగళూరులోని వైదేహి హాస్పిటల్‌కి రెఫర్ చేసి ఎన్టీఆర్ వైద్యసేవ స్కీమ్ ద్వారా శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టింగ్ బిపి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నటుల తెలిపారు. ఈ గొప్ప అవకాశాన్ని ఎస్ఆర్ పురం మండల ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని లోకేష్ కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ సరళ కుమారి తెలిపారు. శనివారం యాదమరి మండలం మర్లబండ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ బాలింతలు గర్భవతులు రక్తహీనత లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై పోస్టు భర్తీ చేయండి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: అనంతపురానికి చెందిన ఎస్సై పరుశు రాం బైరెడ్డిపల్లికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ నెలరోజులు గడుస్తున్నప్పటికి నూతనంగా నియమితులైనా ఎస్సై ఇప్పటికి బాధ్యతలు తీసుకోకపోవడంతో మండల ప్రజలు ఎస్సై కోసం ఎదుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో శాంతిభద్రతలు అప్పుడప్పుడు క్షీణిస్తున్నాయని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో శాంతి భద్రతల దృష్ట్యా నూతన ఎస్సై బాధ్యతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




ఘనంగా 'ఓనం' వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నర్సింగ్ కళాశాలలో శనివారం ఓనం పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిసిఎన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ద్రవిడ సంస్కృతి సాంప్రదాయాలలో భాగమైన ఓనం పండుగను తమ విద్యాసంస్థలో ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- కుప్పంరూరల్: కుప్పం లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతంగా ముగిసినట్లు క్లబ్ సలహాదారు డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్న కంటి రోగులకు పిఈఎస్ వైద్యబృందం వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

'ఘాట్' ఘనత 'విశ్వేశ్వరయ్య'దే..!




నేడు ఇంజినీర్స్ డే

ప్రజాశక్తి-తిరుపతి సిటి

దట్టమైన అడవులు, ఎత్తైన గుట్టలు, భారీ చెట్లు, లోయలు తిరుమల శ్రీవారి చెంతకు రోడ్డు వేయడమంటే ఆషామాషీ కాదు. కష్టతరమైన ఈ పనిని చేసి చూపించారు ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఘాట్ రోడ్లంటే సాదా సీదా రోడ్లు కావు. ఎన్నో మలుపులు. శేషాచలం అడవుల్లో నుంచి వేసిన రోడ్లు ఇవి. 1944, ఏప్రిల్ 10న ఆనాటి ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ ఘాట్ రోడ్డును వేశారు. మొదటగా ఘాట్ రోడ్డును అప్పటి మద్రాస్ గవర్నర్ ఆర్థూర్ హెూప్ ప్రారంభించారు. మొదట్లో ఘాట్‌రోడ్డులో చిన్నపాటి బస్సులు వెళ్లేవి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వేసిన రోడ్లపైనే వాహనాలు వెళుతున్నాయి. రోడ్లు వాడుతున్నారే గానీ, వేరే రోడ్లు మాత్రం వేయలేదంటే ఆయన నైపుణ్యాన్ని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఎంతో ప్రమాదకరమైన మలుపుల రోడ్లను వేయడమంటే సాదా సీదా విషయం కాదు. అప్పట్లోనే ఘాట్ రోడ్డు వేయడానికి ఏడాదికిపైగా సమయం పట్టిందంటే ఎంతకష్టమో ఇట్టే అర్థమైపోతుంది. అయితే ప్రస్తుతం టిటిడే ఇంజనీరింగ్ అధికారులు తారు రోడ్డు మీద తారు రోడ్లు వేస్తూనే ఉన్నారు. తిరుమల ఘాట్ రోడ్డు వేసి 80 వసంతాలు పూర్తి కావడంతో టిటిడే ఇంజనీరింగ్ విభాగం సంబరాలు చేసుకుంటోంది. తిరుపతి నుంచి తిరుమలకు ఘాట్ రోడ్డులో వెళ్ళాలంటే కనీసం 30 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. అదే తిరుమల నుంచి తిరుపతికి రావాలంటే 45 నిమిషాల సమయం తప్పనిసరి. సెప్టెంబరు 15 మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేని జరుపుకుంటూ ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నారు.

ఇంజనీర్లకు ఆయన ఆదర్శం : టివి సత్యనారాయణ, చీఫ్ ఇంజనీర్, టిటిడి




సాంకేతికపరంగా పెద్దగా పరికరాలు అందుబాటులో లేని కాలంలోనే ఆనకట్టలు, సముద్రపు కోతకు గురికుండా నగరాల నిర్మాణాలు, నీటి కాల్వలు, క్రషర్ గేట్లు ఏర్పాటు చేయడంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన ప్రతిభ అమోఘం. ఆయన అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికి ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడే. ఆయన వేసిన తిరుమల ఘాట్‌రోడ్లకు ప్రస్తుతం పర్యవేక్షణ బాధ్యత వహించడం సంతోషకరం.

ఎప్పటికీ వన్నె తరగవు : పి.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఇ-3, టిటిడి



ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సాహసోపేతంగా నిర్మించిన తిరుమల ఘాట్ రోడ్లు ఎప్పటికి వన్నె తగ్గవు. భారీ వర్షాలు వచ్చినప్పుడుకొంత మరమతుకు గురవుతాయే గాని, ఆయన చేపట్టిన నిర్మాణం ఎప్పటికీ చెక్కు చెదరదు. వర్షాల సమయంలో మరమ్మతులు చేసేటప్పుడు మేము ఆయన్నే గుర్తు చేసుకుంటాం. ఆయన సేవలు మాకు ఎపుడూ ఆదర్శనీయమే. తిరుమల ఘాట్‌రోడ్లను ప్రమాదరహితంగా నిలిపేందుకు ఇంజనీర్ల విభాగం నిరంతరం కృషి చేస్తుంది.

ఆయనే మాకు స్ఫూర్తి : కె.మల్లికార్జున ప్రసాద్, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, టిటిడి



ఇంజనీర్లకు దిక్సూచిగా నిలిచిన మోక్షగుండం విశ్వేశరయ్యే మాకు స్ఫూర్తి. సవాళ్లను స్వీకరించడంలో ఆయనకు ఆయనే సాటి. కష్టకాలంలో సైతం ఆయన మేథోశక్తి అమోఘం. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు సైతం ఈ వృత్తిలో రాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

ఆయన్ని చూసే ఇంజనీర్ అయ్యా : వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎలక్ట్రికల్, టిటిడి



నేను చదువుకునే సమయంలోనే..మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్రను చదివాను. మాది గ్రామీణ ప్రాంతం. నీటిపారుదల రంగంలో ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివి. ఆయన్ని ఆదర్శంగా తీసుకునే ఇంజనీరింగ్ రంగంలోకి ప్రవేశించాను. యువ ఇంజనీర్లు ఆయన నైపుణ్యాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి.

కలకాలం గుర్తుంటాయి : పిఎస్ రత్నారెడ్డి, డబ్ల్యుఆర్‌డి ఇఇ, గూడూరు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంటే ఇంజనీర్లకు ఓ మార్గదర్శి. బ్రిటీష్ కాలంలోనే ఆయన చేసిన నిర్మాణాలు ఇతరులకు ఆదర్శం. మైసూరు వద్దనున్న కృష్ణరాజుసాగర్ నిర్మాణం అప్పట్లోనే ఆసియాలో గొప్పకట్టడంగా పేరు గడించింది. కలకాలం గుర్తుండే పనులు చేయడమే ఇంజనీర్ల పండితుడైన విశ్వేశ్వరయ్యకు ఘనమైన నివాళి.

నిజాయతీ, నిబద్ధతకు మారుపేరు : కె.శివరామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, టిటిడి



సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్న సందర్భంగా వారి నిజాయతీ, నిబద్ధతను నేటి ఇంజనీర్లు గుర్తించుకోవాలి. వృత్తి పట్ల వారి ఇచ్చిన సందేశాన్ని, దేశ నిర్మాణంలో ఆయన అద్భుతమైన కృషిని, ఉన్నత ప్రమాణాలను స్మరించుకుంటాం. ఆయన జీవితం భారతీయ ఇంజనీర్లకు ఎప్పటికి స్ఫూర్తిదాయకమే.

ఆరోగ్యానికి రక్తకణాలు కీలకం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్లాస్మా, ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ కీలకమని చెన్నయ్ అపోలో ఆస్పత్రి ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ పి.ప్రభు అన్నారు. శనివారం తిరుపతి అపోలో క్లినిక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రరక్త కణాలు ఊపిరితిత్తుల నుంచి శరీర కణజాలాలకు ఆక్సిజన్‌ను తీసుకెళతాయన్నారు. కార్బన్‌డయాక్సైడ్‌ను తిరిగి ఊపిరితిత్తులకు పంపుతాయన్నారు. ఈ ప్రక్రియలో ఎర్ర రక్తకణాలు కీలకమన్నారుర. తెల్ల రక్తకణాలు శరీరానికి రక్షణగా, అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయన్నారు. రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. ప్లేట్‌లెట్స్ రక్తం గడ్డ కట్టడానికి అవసరమన్నారు. చెన్నయ్ అపోలో ఆస్పత్రిలో రక్త సమస్య ఉన్నవారికి అవగాహన కల్పించి, చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.



క్రైం న్యూస్

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఇద్దరు మృతి

ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ప్రజాశక్తి- బంగారుపాలెం: కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురు గాయపడిన సంఘటన శనివారం మండలంలోని కొత్తపల్లి బైపాస్ వద్ద చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాసులు తెలిపన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం కర్నాటక రాష్ట్రం దొడ్డబల్లాపురం నుంచి ఏడుగురు ఇన్నోవా కారులో కంచిలోని ఆలయాలు సందర్శించి, ఆ తరువాత బట్టలు కొన్నేందుకు బయలుదేరారు. కాగా బంగారుపాలెం మండలం కొత్తపల్లి ఫ్లైఓవర్ వద్ద అతివేగం వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగరాజు (56), లక్ష్మీ (35) అక్కడిక్కడే మృతి చెందారు. మిగిలిన ఐదుగురు శ్రీనివాసమూర్తి (51), తనూజ (36), సుచిత్ర(48), ఉష (32), ధరణి (22) తీవ్రంగా గాయపడటంతో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొలార్ మెడికల్ కళాశాలను తరలించారు. ప్రమాద స్థలాన్ని తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గంగాధరనెల్లూరు మండలం నీవానది ప్రాంతం నుండి ఇసుకను లారీలో అక్రమంగా తమిళనాడుకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆ ఇసుక లారీని మైన్స్ అధికారులకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఇసుక లారీ

ఘనంగా జాతీయ భాష దినోత్సవం వేడుకలు




విజయం స్కూల్‌లో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్థానిక సుందరరాజపురం విజయం సిబిఎస్‌సి పాఠశాలలో శనివారం జాతీయ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల అధ్యక్షులు డాక్టర్ తేజమూర్తి, కార్యనిర్వహణ అధ్యక్షులు డాక్టర్ శైలజ మూర్తి మాట్లాడుతూ దేశ ప్రజల్ని ఏకతాటిపై నడిపేందుకు ప్రాంతీయ విభేదాలను తొలగించేందుకు జాతీయ భాషా హిందీ ఎంతో తోడ్పాటు అందించిందని తెలిపారు. జాతీయ భాష హిందీని ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బృందావన్ స్కూల్‌లో..

స్థానిక బృందావన్ సిబిఎస్ఈ పాఠశాలలో శనివారం ఘనంగా హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు శైలజ, పాఠశాల డైరెక్టర్ ప్రియా హిందీ భాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. హిందీ భాషపై ప్రముఖ హిందీ కవుల వేషధారణ, అక్షర విన్యాసం, నేటి తల్లిదండ్రుల పరిస్థితులపై ఒక చక్కని నాటిక, పిల్లలచే హిందీ భాషపై పాటలు, పద్యాలు, కవితలు, నృత్యం అలరించాయి.



మాట్లాడుతున్న బృందావన్ స్కూల్ వ్యవస్థాపకులు శైలజ

'కేశవరెడ్డి'లో చిత్తూరు జోన్ క్రీడా సంబరాలు

ప్రజాశక్తి - రేణిగుంట : మామండూరులోని కేశవరెడ్డి ఈఎం స్కూల్ల చిత్తూర్ జోన్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు ఈనెల 14-16 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్నాయి. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి దాదాపు 800 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, త్రోబాల్ వంటి జట్టు పోటీలు. రన్నింగ్ రేస్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ ,హై జంప్ మొదలగు వ్యక్తిగత పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 16వ తేదీన బహుమతులు ఇవ్వనున్నారు. కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపి, సమాజంలో ఉత్తమ పౌరునిగా తీర్చిదిద్దాలని, గెలవాలనే తపన, గెలుస్తామనే నమ్మకం, గెలిచి తీరాలనే దఢ సంకల్పం విద్యార్థుల్లో కలిగించాలనే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రముఖులు సుధా రాజ్యం , నరసింహారెడ్డి పాల్గొన్నారు.